క్లుప్తంగా

పశువైద్య కేంద్రాల తనిఖీ

గుడిపాల: పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకట్రావ్ మంగళవారం మండలంలోని చీలాపల్లె, మొగరాళ్లపల్లె, బొమ్మసముద్రం పశువైద్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోజూ ఎన్ని పశువులు కేంద్రానికి వైద్యం కోసం తెస్తున్నారు? వైద్యం ఎలా చేస్తున్నారు? అని ఆరా తీశారు. పాడి రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, డాక్టర్లు సాయితేజ, సాయిసుధ, గోపాలమిత్ర కిశోర్, వెటర్నరీ అసిస్టెంట్ అబ్దుల్లా పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఎంపిక



శక్తిప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్వేటినగరం ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ అండర్–14 బాలబాలికల పోటీల్లో తొడతర హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఎస్.శక్తిప్రియ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఇ.ప్రకాష్‌బాబు, పీఈటీ త్యాగరాజ రెడ్డి తెలిపారు. శక్తిప్రియను మంగళవారం హైస్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని హెచ్ఎం దామోదరనాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పూతలపట్టుకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. బాలికలు మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు అందుకున్నారని చెప్పారు. 9 వతరగతి చదువుతున్న మేఘన, తేజస్వి, విష్ణువర్ధన్, రక్షిత్ జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. వారిని హెచ్ఎంతోపాటు టీచర్లు అభినందించారు.

గృహ నిర్మాణ పనుల పరిశీలన

ఐరాల: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ నిర్మలాదేవి అన్నారు. మంగళవారం చినకాంపల్లెలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రధానంగా జగనన్న కాలనీలో తాగునీరు, రోడ్డు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ సంధ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'పశు విజ్ఞాన బడి'తో పాడి రైతుల అభివృద్ధి

ఐరాల: పశు విజ్ఞాన బడితోనే పాడి రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఏడీ పద్మ అన్నారు. మంగళవారం 35 యర్లంపల్లె రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులకు పశు విజ్ఞాన బడి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాడి రైతులను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పశువులు అనారోగ్యం బారిన పడినప్పుడు 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఉచిత పశువుల అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

పూతలపట్టు: జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది రోజున గృహప్రవేశం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని చిటిపిరాళ్లలో జగనన్న లేఔట్‌ను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. మంజూరైన 1875 ఇళ్లలో 680 నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు దక్కిన అరుదైన గౌరవమిది

పలమనేరు: ఆలయాల కమిటీల్లో విధిగా నాయీ బ్రాహ్మణులుండాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడం తమకు దక్కిన అరుదైన గౌరవమని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాటి ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని సీఎంగా నేడు నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో తమ కులస్తులను నియమించారని తెలిపారు. అయితే అన్ని దేవాలయాల పాలక కమిటీల్లోనూ ఓ సభ్యుడిని నియమించాలని ఆదేశాలు జారీ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. సీఎం, దేవదాయశాఖ మంత్రికి కృతజ్ఞతలను తెలిపారు.

జగనన్నకు తోడుగా ఉందాం

- గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల శిక్షణలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపు



చిత్తూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



హాజరైన గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు



చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్/గుడిపాల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలో రావడానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విజయ వారథులుగా మారాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులోని పార్టీ కార్యాలయం, గుడిపాల మండల కేంద్రంలో వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చిత్తూరు నియోజకవర్గానికి 296 సచివాలయ కన్వీనర్ల కిట్లు వచ్చాయని, ఇందులో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు, గత రాక్షస పాలన– ప్రస్తుత రాజన్న పాలనలో ఉన్న తేడాలు తెలిపే కరపత్రాలు, ప్రజామద్దతు పుస్తకం, జగనన్న ఫొటోతో ఉన్న మొబైల్ స్టిక్కర్లు ఉన్నాయన్నారు. వీటిని సచివాలయాల వారీగా అందజేస్తున్నామన్నారు. ఇక ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించడమే కాకుండా లబ్ధి గురించి విస్తృత ప్రచారం చేయాలని, తద్వారా గత పాలనలో, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల, నగర ఇన్‌చార్జిలతో కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేసి పార్టీకి మంచిపేరు తేవాలన్నారు. అలాగే, సీఎం పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో మండల వ్యవస్థ ఆవిర్భావం నుంచి గుడిపాల మండలం టీడీపీ కంచుకోటగా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అధిక ఎంపీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను పార్టీ కైవసం చేసుకుందన్నారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని మార్గదర్శనం చేశారు. గత పాలన కంటే అన్ని విధాలా వైఎస్సార్‌సీపీ పరిపాలన బాగుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, నాయకులు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, మండల నాయకులు త్యాగ, మండల కన్వీనర్ల ఇన్‌చార్జి విశాల్‌రెడ్డి, కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజనీకాంత్, గుణవతి, మణి, సంపూర్ణమ్మ, జయకోడి, గుడిపాల మండల సచివాలయ కన్వీనర్ సాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు యోవాన్, శిలంబరసన్, సాయిప్రతాప్, రవి, సామువేలు, శేఖర్, క్రిష్ణ, రవీంద్రారెడ్డి, గణపతి, రాకేష్‌సర్పంచులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు : తూర్పు, రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలుపే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా పనిచేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు పనిచేసేవారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. శ్యామ్ ప్రసాద్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని, సామాజిక సేవలతో మంచిపేరున్న ఆయన్ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేర్నాటి మాట్లాడుతూ, పూతలపట్టు నియోజకవర్గస్థాయిలో 10,000 మంది పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, అందరూ తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దలకు మర్యాదిచ్చి మాట్లాడు లోకేష్

యువగళం పాదయాత్రలో నారాలోకేష్ నాలుక అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హితవు పలికారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్, మంత్రి పెద్దిరెడ్డిని అమర్యాదకరంగా మాట్లాడటం సరికాదన్నారు. లోకేష్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలోనే లోకేష్ పాదయాత్రకు ప్రజలు మద్దతు లభించకపోవడంతో ప్రభుత్వం, తమ మంత్రులు, నాయకులపై నోటికొచ్చినట్లు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కుమార్ రాజా, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, నియోజకవర్గ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చిత్తూరు విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణ



విద్యార్థిని అభినందిస్తున్న నారాయణ కళాశాల ప్రిన్సిపల్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మంగళవారం ఫలితాలను ప్రకటించారు. మురుగానిపల్లెలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల (పీఎస్ఎన్ బ్రాంచ్) విద్యార్థులు సాయితేజ రెడ్డి 98.69 శాతం, అలాగే నితిన్ 96.12, మోహన్‌కృష్ణ 93.16, రేష్మా 92.19, పవన్‌తేజ 91.04, హేమశ్రీ 90.83 ఫలితాలు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

నారాయణలో : గిరింపేటలోని నారాయణ విద్యాసంస్థ విద్యార్థి పుష్పక్ 98.91 శాతం ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ సునీల్ తెలిపారు. ఆ విద్యార్థిని ఆ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పకడ్బందీగా 'క్లాప్'

చిత్తూరు అర్బన్: 'క్లాప్'(క్లీన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాలను వార్డుల్లో పకడ్బందీగా అమలు చేయాలని నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. క్లాప్ అమలుపై మంగళవారం ఎంహెచ్ఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. ప్రధానంగా యూజర్ చార్జీల వసూళ్లపై వార్డుల వారీగా సమీక్షించారు. నగరాలను చెత్త రహితంగా తీర్చిదిద్దడంలో గృహస్తులు, వ్యాపారస్తులు, దుకాణదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించిన ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని వివరించాలన్నారు. వారాంతానికి నిర్దేశిత క్లాప్ లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

రాయితీపై ప్యాకింగ్ షెడ్లు

బంగారుపాళెం: ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై ప్యాకింగ్ షెడ్లు మంజూరు చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. మండలంలో మామిడి, ఇతర పండ్ల తోటలు కలిగిన రైతులు తమ తోటల్లో 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో ప్యాకింగ్ షెడ్లను(గది) నిర్మించుకునేందుకు 50 శాతం (రూ 2 లక్షల వరకు) రాయితీ ఇస్తోందన్నారు. షెడ్డుకు 2 తలుపులు, 8 కిటికీలు ఉండేలా నిర్మించుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పొలం పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ జెరాక్సు, బ్యాంకు ఖాతా మొదటి పేజీ జెరాక్సులను ఉద్యానశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 7995086960 సంప్రదించాలని కోరారు.

తప్పిదాలు లేకుండా రీ-సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: రీ–సర్వే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ పరిధిలో తప్పిదాలకు తావివ్వకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నగర కమిషనర్ జె అరుణ ఆదేశించారు. అర్బన్ రీసర్వే కార్యక్రమంపై మంగళవారం నగరపాలక కార్యాలయంలో వార్డు అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రీ–సర్వేలో భాగంగా నగరపాలక సంస్థలోని అన్ని వార్డుల పరిధిలో వివిధ రకాల అస్తులకు సంబంధించి అసెస్మెంట్ నంబర్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో డేటాను ఒకసారి సరిచూసుకుని క్షేత్రస్థాయిలో సర్వే చేయాలన్నారు. ఆన్‌లైన్ డేటాలో సందేహాలుంటే సాంకేతిక బృందాన్ని సంప్రదించి సరి చేసుకోవాలన్నారు. వార్డు అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయంతో రీ–సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. మాస్టర్ ట్రైనీలు రీ–సర్వే ఆన్‌లైన్ డేటా, అప్లోడింగ్, క్షేత్రస్థాయి సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ఏఎస్వో సౌందర్ రాజన్, టీపీఎలు మురళీకృష్ణ, జాభీరా ఖాతుం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



తేనెబండ హౌసింగ్ లేఔట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు గాను ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని నగర కమిషనర్ జె. అరుణ హౌసింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరపాలక పరిధిలోని తేనెబండ హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అవసరాలను అడి గి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్, సూపర్‌వైజర్లు, అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ విన్నర్స్‌కు బహుమతి



నగదు బహుమతి అందజేస్తున్న అపోలో ఆసుపత్రి వైద్యులు

తవణంపల్లె: తవణంపల్లె అపోలో ఆసుపత్రిలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలలో గెలుపొందిన జట్టుకు రూ.10 వేలను బహుమతిగా వైద్యాధికారి అనిషా అందజేశారు. అపోలో గ్రూప్ చైర్మన్ డాక్టర్ పద్మవిభూషణ్ ప్రతాప్ రెడ్డి 90వ జన్మదినం పురస్కరించుకుని ఈ టోర్నీ నిర్వహించారు. తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్, రిపోర్టర్ మురుగ జట్టు విజేతగా నిలిచారు. వారికి అపోలో ఆసుపత్రి వైద్యులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



శ్మశాన భూమి చదును చేసిన దృశ్యం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీ టి.వేపనపల్లె ఎస్టీ కాలనీ, తాళంబేడు ఎస్సీ కాలనీ తదితర గ్రామాల పరిధిలోని శ్మశాన భూముల్లో మంగళవారం పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

చిత్తూరు అర్బన్: స్థానిక 17వ డివిజన్‌లోని సచివాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. మూవ్‌మెంట్ రిజిస్టర్ విధిగా ఉండాలన్నారు.

బోధగుట్టపల్లెలో గడప గడపకు..



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: మండలంలోని బోధగుట్టపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పింఛన్లు, పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు నిర్మించాలని, మురుగు కాలువలు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, అర్హులకు పింఛన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు వీటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, గొందివాళ్ల వూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి ముంగిటకే వైద్యం



అవగాహన కల్పిస్తున్న లోహిత్ చెంగల్‌రాయన్

బంగారుపాళెం: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నట్టు క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు చాటి చెప్పాలని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తుంబకుప్పం పీహెచ్‌సీ సమావేశ భవనంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బాలింతలు, గర్భవతులు, ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పొందిన, ఇతర వ్యాధులకు సంబంధించిన వారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఆశావర్కర్లు వ్యాధిగ్రస్తులను గుర్తించి ఆయా సచివాలయాలలో నిర్వహించే క్యాంపులలో తెలియజేయాలన్నారు. ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. సీహెచ్ఓ షమీమ్, ఎంపీహెచ్ఈఓ బృహస్పతి, సూపర్‌వైజర్లు హరికృష్ణ, సుమతి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

చిత్తూరు రెడ్డి జేఏసీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో మంగళవారం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరిబాబురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా యాగమరెడ్డి, ప్రచార కార్యదర్శిగా నరసింహారెడ్డి, యువత అధ్యక్షుడిగా మునీంద్రబాబు, వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా గిరిబాబురెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా చిట్టిరెడ్డిని ఎన్నుకున్నారు. వారికి నియమాక పత్రాలను అందజేశారు.పలు సేవా కార్యక్రమాలతో అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. కార్పొరేటర్ హరిణిరెడ్డి, అసోసియేషన్ పెద్దలు రాధికారెడ్డి, గోపినాథ్ రెడ్డి, సుగుణశేఖర్‌రెడ్డి, హేమబిందురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి



మహిళలకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న నాగపద్మిణి



యాదమరి : మోర్థానపల్లెలో..



తవణంపల్లె : టి.పుత్తూరులో..

బంగారుపాళెం: చిరుధాన్యాల సాగుతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిణి అన్నారు. చిరుధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై మంగళవారం మండలంలోని మహాసముద్రం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, చిరుధాన్యాలైన రాగి, జొన్న, సాములు, కొర్రలు, సజ్జలు వంటి పంటల సాగుపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటిలోని పోషక విలువలు, చిరు ధాన్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, మార్కెట్‌లో ఉన్నడిమాండ్ గురించి అవగాహన కల్పించారు. సేంద్రియ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మజ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి : సేంద్రియ వ్యవసాయంపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని మోర్థానపల్లె రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్ర అధికారి లక్ష్మీప్రసన్న నిర్వహించారు. చిరుధాన్యాల సాగు, వాటిలో పోషక విలువల గురించి వివరించారు. అనంతరం చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ చరిత, సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయశాఖ డీఆర్‌సీ డీడీఏ గోపాల్ కోరారు. చిరుధాన్యాల సాగుపై మంగళవారం మండలంలోని టి.పుత్తూరులో మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏతోపాటు చిత్తూరు ఏడీఏ మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలు సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తవణంపల్లె వ్యవసాయశాఖ అధికారి జి.ప్రకాష్, వీహెచ్ఏ శ్రీధర్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కౌమార దశ పిల్లలందరికీ ఐరన్ మాత్రలు

- ఆర్‌బీఎస్‌కె కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన



మాట్లాడుతున్న డాక్టర్ సుదర్శన్

తవణంపల్లె: కౌమార దశలో ఉన్న పిల్లలందరికీ ఐరన్ మాత్రలు అందజేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన ఆదేశించారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఐరన్ మాత్రలు కౌమార దశలో ఉన్న స్కూల్ పిల్లలతో పాటు బయట ఉన్న పిల్లలకు వారం వారం ఇవ్వాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి మాట్లాడుతూ, డెంగీ జ్వరం కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ 104 శిబిరంలో బీపీ, మధుమేహం పరీక్షలు చేయాలని ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై డాక్టర్ ప్రియాంక, డీపీఎంఓ మణి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు జయమ్మ, రాజశేఖర్, శ్రీహరి, అమరావతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



రమాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు

పలమనేరు: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక ఎస్సీ సంఘం నేతలు, ఎస్సీ ఉపా ధ్యాయ సంఘం నేతల ఆధ్వర్యంలో మంగళ వారం డాక్టర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు నాగరాజు, పుష్ప రాజు, నాగయ్య, ప్రమీల పాల్గొన్నారు.